గ్రామదేవతలకు సారె సమర్పణ



గ్రామ దేవతల సారె ఊరేగింపులో మహిళలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరిలు, అడవివరం గ్రామ దేవతలు పైడితల్లి, బంగారమ్మ అమ్మవార్లకు గురువారం మహిళలు సారె సమర్పించారు. చీరలు, పసుపు కుంకుమలు, గాజులను శిరస్సుపై పెట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అప్పన్న తొలిపావంచా వద్ద స్వామిని దర్శించుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్ల ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు.



సుజాతనగర్‌లో గురువారం జరిగిన బాబు షూ్యరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శోభా హైమావతి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు.



సచివాలయ సిబ్బందికి ఘన సత్కారం



బదిలీపై వెళ్తున్న ఎస్ఆర్ పురం సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ దూది విజయలక్ష్మి, గ్రామపెద్దలు

పెందుర్తి: గత ఆరేళ్లుగా తమకు సేవలందించి బదిలీపై వెళుతున్న ఎస్ఆర్ పురం గ్రామ సచివాలయ సిబ్బందిని గ్రామపెద్దలు, గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందిని దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించారు. వారు ప్రజలకు అందించిన సేవలను కొనియాడుతూ ఘనంగా వీడ్కోలు పలికారు. నాయకులు దూది వెంకటరమణ, అల్లూరి గణపతి సోమరాజు, కాయిత ఎర్రిబాబు, గొరపల్లి సోమునాయుడు, తాడి వెంకటరమణ, గొల్లవిల్లి గణేష్, ఒమ్మి సోంబాబు, గొల్లవిల్లి రమణ, యర్ర మర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘ఉచిత బస్సు’పై డ్రైవర్లకు శిక్షణ

సింహాచలం: ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై సింహాచలం డిపో డ్రైవర్లకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. విశాఖ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పాల్గొని డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి డ్రైవర్ ప్రతి బస్‌స్టాప్‌లో బస్‌ను ఆపాలన్నారు. ప్రయాణీకుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

సింహాచలం: విజినిగిరిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అడవివరం ఆరోగ్య కేంద్ర హౌస్ సర్జన్లు, సూపర్‌వైజర్లు గురువారం సందర్శించారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, మధ్యాహ్న భోజన సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంట చేసే వారు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్ఎం ఎస్‌టీపీ విద్యావతి, ఉపాధ్యాయుడు ఐఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు

సింహాచలం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని అడవివరం గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి, న్యాయవాది రామకృష్ణ, సిబ్బంది ఎల్లమ్మ, రిటైర్డ్ ఉద్యోగి పి.వెంకటరావు, పాఠకులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి శిరీష ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ప్రాధాన్యత, పుస్తకాల విలువను మానవాళికి చాటిచెప్పిన మహనీయునిగా కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నాగేశ్వరి, భవిత కేంద్రం టీచర్ రాణి, అంగన్‌వాడీ కేంద్రం టీచర్ చినతల్లితో పాటు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



కుక్క దాడిలో రమణమ్మ చేయికి పడిన గాయం



కుక్క దాడిలో గాయపడిన వెంకటరావు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెంలో వీధి కుక్కల దాడిలో గ్రామానికి చెందిన కూండ్రపు రమణమ్మ, కూండ్రపు వెంకటరావు తీవ్రంగా గాయపడ్డారు. వీధిలో సంచరిస్తున్న వీధి కుక్క వీరిపై గురువారం దాడికి పాల్పడి చేతులపై తీవ్రంగా గాయపర్చింది. క్షతగాత్రులకు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది వైద్య సేవలు అందించారు. రోజురోజుకూ పెరిగిపోతున్న వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సంస్థ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఫీడర్ పరిధిలోని సబ్బవరం, ఇరువాడ, అసకపల్లి, గొల్లలపాలెం, తవ్వవానిపాలెం, అమృతపురం పంచాయతీల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. దీంతో రావాడ, జెల్లలపాలెం, గొల్లగుంట, ధర్మారాయుడుపేట, బొట్టవానిపాలెం, మోటూరువానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఈఈ రామకృష్ణ తెలిపారు.

















